

గణేశ్ దీవెనలతో సాగుదాం

వినాయకుడి చల్లని దీవెనలతో ఉద్యోగులు ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. 8లో▸



విద్యావ్యవస్థ ఉన్నతికి కృషి

ఉపాధ్యాయ సమస్యలపై గిరిజన ఉపాధ్యాయ సంఘం పోరాటం చేస్తోందని జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్ అన్నారు. 8లో▸



తెరపైకి బీసీ ఉద్యమం

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్టీలకతీతంగా బీసీ నేతలు ఒకే వేదికపైకి వచ్చారు. 9లో▸

ఓటరు నమోదులో ఆదర్శంగా నిలుద్దాం

- ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయేంద్రబోయి
- రాజకీయ పార్టీలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న విజయేంద్రబోయి, కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: ఓటరు నమోదులో జిల్లా ఆదర్శంగా నిలవాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, ఎలక్ట్రోరల్ పరిశీలకురాలు విజయేంద్రబోయి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆమె కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి మాట్లాడారు. ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాల్లో జిల్లా అధికారుల పనితీరు బాగుందని కితాబు ఇచ్చారు. ట్రాన్స్‌జెండర్లు, 90ఏళ్ల పైబడిన ఓటర్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై ఆరా తీశారు. కొత్త ఓటర్ల నమోదు, డబుల్, చనిపోయిన వ్యక్తుల ఓట్లు తొలగింపు గురించి తెలుసుకున్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలన్నారు. కళాశాలల్లో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జిల్లా అధికారులు రూపొందించిన లఘు చిత్రాలను ఆమె వీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా ఓటర్ల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లాలో వందశాతం ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమన్నారు. రాజకీయ పార్టీలకు నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితా అందజేస్తామని తెలిపారు. అత్యధిక ఓటర్లను నమోదు చేసిన జిల్లాగా వికారాబాద్ నిలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీఓలు విజయకుమారి, శ్రీనివాస్‌రావ్, డీటీడబ్ల్యూఓ కోటాజీ, తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి

అనంతగిరి: అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిషత్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల వలన దెబ్బతిన్న రోడ్ల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు ఏ విధంగా జరుగుతున్నాయని డీఈఓను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సీఈఓ సుభాషిణి, జెడ్పీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

పల్లె ప్రగతి పనులు భేష్

అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి పనులు బాగున్నాయని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చీమల్‌దరి గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనం, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి బృందావనం, శ్మశానవాటిక, కంపోస్ట్ షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో 100శాతం భూగర్భ మురుగు కాల్వల నిర్మాణం, విశాలమైన సీసీ రోడ్లు, ప్రతి ఇంటికీ బీఎస్ఎన్ఎల్ ల్యాండ్ లైన్ కనెక్షన్, ఉచిత వైఫై వంటివి అభివృద్ధికి నిదర్శనమన్నారు. సర్పంచులు చిత్తశుద్ధితో పని చేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం సర్పంచ్ నర్సింహారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, శంకర్, కార్యదర్శి సుగుణ పాల్గొన్నారు.

బైక్‌లకు నిప్పుపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు


కాలిపోయిన బైక్‌లు

దోమ: బైక్‌లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఘటన శుక్రవారం దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవిగౌడ్ కథనం మేరకు.. పాలేపల్లికి చెందిన కావలి దస్తయ్య మనుమరాలి పుట్టు వెంట్రుకలు తీయించడానికి బంధువులతో కలసి యాదగిరి గుట్టకు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం బంధువులు గ్రామానికి చేరుకున్నారు. పరిగి మండలం బురాన్‌పూర్‌కు చెందిన శ్రీనివాస్, కొట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్ బైక్‌లపై గ్రామానికి వచ్చారు. బైక్‌లను దస్తయ్య ఇంటి వద్ద ఉంచి గురువారం ఉదయం యాదగిరిగుట్టకు వెళ్లారు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు బైక్‌లకు నిప్పంటించారు. దీంతో అవి పూర్తిగా కాలిపోయాయి. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న దస్తయ్య యాదగిరిగుట్ట నుంచి తిరిగి వచ్చాడు. గ్రామంలో అనుమానంగా ఉన్న పలువురిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

గ్రీన్‌సిటీ కాలనీలో చోరీ

బంగారం, నగదు అపహరణ

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని గ్రీన్‌సిటీ కాలనీలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన చర్చి పాస్టర్ లక్ష్మణ్‌పాల్ గురువారం రాత్రి ఇంట్లో లేని సమయంలో.. దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని 3తులాల బంగారంతో పాటు, చర్చికి సంబంధించిన రూ.17వేల నగదును ఎత్తుకెళ్లారు. అదే కాలనీలోని మరోవ్యక్తి ఇంట్లోకి దొంగలు చొరబడి.. వెతకగా ఏమీ లభ్యం కాకపోవడంతో ఇళ్లంతా చిందరవందర చేసి వెళ్లిపోయారు. ఈ మేరకు తాండూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో స్నానానికి వెళ్లి..

ఫిట్స్ రావడంతో నీటమునిగి వ్యక్తి మృతి


చెన్నయ్య (ఫైల్)

కుల్కచర్ల: చెరువులో స్నానానికి దిగిన వ్యక్తికి ఫిట్స్ రావడంతో నీటిలో మునిగి మృతి చెందిన ఘటన చౌడాపూర్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మరికల్ గ్రామానికి చెందిన చిట్టెల చెన్నయ్య(55) గురువారం మధ్యాహ్నం హెయిర్ కటింగ్ చేయించుకొని స్నానం చేసేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. చెరువులో దిగి స్నానం చేస్తుండగా ఫిట్స్ రావడం, చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. శుక్రవారం చెరువు వైపు వెళుతున్న కొందరు నీటిలో మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడు చెన్నయ్యగా గుర్తించారు. మృతుడి కూతురు అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నవాబుపేట ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.


మెగా డీఎస్సీ వేయాల్సిందే

- వికారాబాద్‌లో నిరుద్యోగుల నిరసన


అమరుల స్థూపం వద్ద నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

వికారాబాద్ అర్బన్: మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీనే ముద్దు అని అభ్యర్థులు అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో బైఠాయించారు. అనంతరం తెలంగాణ అమరుల స్థూపం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించిన 13,500 పోస్టులతో డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి నిరీక్షించామని, తీరా అరకొర పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. నిరుద్యోగుల ఆశలు అడియాశలయ్యాయన్నారు. సీఎం ప్రకటించిన పోస్టులతో డీఎస్సీని వేయాలని, లేకుంటే పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.


వినాయక శోభాయాత్రలో భక్తులు


ట్రాక్టర్‌పై లంబోదరుడు

నేత్రపర్వంగా శోభాయాత్ర

తాండూరు పట్టణంలో శుక్రవారం రాత్రి గణేశ్ నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బాజాభజంత్రీలు, డప్పు చప్పుళ్ల మధ్య స్వామివారి ఊరేగింపు వైభవంగా సాగింది. అనంతరం చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

– తాండూరు/తాండూరు టౌన్


గణేశ్ శోభాయాత్రలో మహిళల నృత్యాలు


గణేశుడి శోభాయాత్రలో భక్తులు


గణపతిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

వ్యక్తి అదృశ్యం

కొందుర్గు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఉమ్మెంత్యాలలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన కర్రె చెన్నయ్య(65) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి మధ్యాహ్నం అయినా తిరిగి రాలేదు. గ్రామ శివారులోని పాడుబడిన బావి వద్ద చెన్నయ్య టవల్, చెప్పులు కనిపించాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. బావిలో బురద, చెత్త, చెదారం ఉండడంతో నీరు తోడేందుకు వీలు పడలేదని.. శనివారం గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

వివాహిత బలవన్మరణం

శంకర్‌పల్లి: ఉరేసుకుని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మున్సిపల్ పరిధిలోని బుల్కాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కటికె అంకిత(35) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యుల రోదనలు విన్న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతురాలు రాజుకు రెండో భార్య. ఈయన మొదటి భార్య పదేళ్ల క్రితం అనారోగ్య సమస్యతో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు సంతానం. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

మంత్రి పట్నంను కలసిన వీణ


మంత్రి మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

తాండూరు: మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిని శుక్రవారం తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణ, కమిటీ సభ్యులు కలిశారు. నగరంలో మంత్రిని కలిసి సన్మానించారు. మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి రావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉమాశంకర్, సభ్యులు ముస్తఫా, వెంకటయ్య, వెంకట్, కాశీం, గోవింద్ నాయక్, ప్రశాంత్‌గౌడ్, గోపాల్ రెడ్డి, భానుప్రసాద్, ప్రకాశం, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ ఉన్నతికి కృషి

టీజీయూఎస్


విజయ చిహ్నం చూపిస్తున్న సంఘం నాయకులు

కుల్కచర్ల: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం నిర్విరామంగా కృషిచేస్తోందని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్ అన్నారు. గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆవిర్భవించి 18సంవత్సరాలు పూర్తికావడంతో సంఘ అధ్యక్షులు సూర్య ఆధ్వర్యంలో శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలో సంఘ సభ్యులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. తిమ్యానాయక్ మాట్లాడుతూ... గిరిజన ఉపాధ్యాయుల సమస్యలతో పాటుగా విద్యావ్యవస్థ ఉన్నతికి టీజీయూఎస్ సంఘం పోరాడుతుందన్నారు. టీజీయూఎస్ సంఘం మండల అధ్యక్షుడు సూర్యనాయక్, నాయకులు రాములు, కల్యానాయక్, భాస్కర్, శంకర్, దాస్య, రాజు, మల్లేష్, రాజు, ధారసింగ్, సీఆర్పీలు రఘు, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

142 జీఓను రద్దుచేయాలి

సీహెచ్‌సీ ఎదుట వైద్యసిబ్బంది నిరసన

కుల్కచర్ల: ప్రజారోగ్యమే లక్ష్యంగా విధులు వైద్యసిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తోంది కుల్కచర్ల మండల కమ్యూనిటీ హెల్త్ కోఆర్డినేటర్ చంద్రప్రకాష్ ఆరోపించారు. శుక్రవారం కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట వైద్యసిబ్బందితో కలిసి ఆయన నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నూతనంగా తీసుకవచ్చిన జీఓ నంబరు 142ను రద్దుచేసేవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 25న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కుల్కచర్ల మండల వైద్యాధికారి మాధురి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రత్నలత, యాదమ్మ, విజయలక్ష్మి, వెంకటయ్య, అంజు, సుజాత, వెంకటమ్మ, జంగమ్మ, మంగమ్మ, శ్రీలత, జ్యోతి, మైభమ్మ, భారతమ్మ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో రామ్మోహన్‌రెడ్డి

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలం పుర్సంపల్లి, అడవి వెంకటాపురం గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలోని టీఆర్‌ఆర్ నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు రవినాయక్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ నాగమణి


పోషకాహారాన్ని అందజేస్తున్న సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్‌రూరల్: పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ నాగమణి అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెలో పాల్గొనడంతో శుక్రవారం మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆండాలు ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ నాగమణి హాజరై బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తప్పని సరిగా పోషక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పోషకాహారం లోపంతో రక్తహీనత, రోగ నిరోధక శక్తి తగ్గుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గుడ్లు, పాలతో పాటుగా పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజస్విని, లబ్ధిదారులు శకుంతల, అమృత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి దీవెనలతో సాగుదాం

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఘనంగా నిమజ్జనం
- వేలంలో రూ. 2,22,222 పలికిన లడ్డూ ప్రసాదం

వికారాబాద్ అర్బన్: వినాయకుడి చల్లని దీవెనలతో ఉద్యోగులు ముందుకు సాగాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహాన్ని శుక్రవారం నిమజ్జనం చేశారు. అంతకుముందు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు అన్ని పండుగలను కలిసి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గణేశ్ లడ్డూ ప్రసాదాలకు వేలం నిర్వహించారు. స్వామి చేతిలోని మహా ప్రసాదాన్ని రెవెన్యూ శాఖకు చెందిన వీ అరుణ్‌కుమార్ రూ. 2,22,222లకు దక్కించుకున్నారు. మరో లడ్డూ ప్రసాదాన్ని ఎం శ్రీనివాస్ రూ.2,20,000, పరిశ్రమల శాఖలో పని చేస్తున్న రమేష్ కలశాలను రూ. 44,444లకు దక్కించుకున్నారు. అనంతరం విగ్రహాన్ని బాజాభజంత్రీల మధ్య కలెక్టరేట్ ఆవరణలోని నీటి కుంటలో నిమజ్జనం చేశారు. వేడుకలో డీటీడబ్ల్యూఓ కోటాజీ, డీఈఓ రేణుకాదేవి, డీవైఎస్‌ఓ హనుమంతరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, మేనేజర్ అలివేలుమంగ, డీఏఓ గోపాల్, డీఎస్‌డీఓ మల్లేశం, ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి, మత్స్యశాఖ అధికారి చరితారెడ్డి, మెప్మా పీడీ రవికుమార్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వినాయకుడి విగ్రహాలకు స్వాగతం పలుకుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

వైభవంగా శోభాయాత్ర

తాండూరు: పట్టణంలో వినాయకుడి శోభాయాత్ర శుక్రవారం వైభవంగా సాగింది. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భావిగి భద్రేశ్వర చౌక్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలకు మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్‌పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పాత తాండూరు గడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి ఎస్పీ కోటిరెడ్డి పూజలు చేశారు. హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నర్సింహులు, సభ్యులు, పూజారి పాండు పాల్గొన్నారు.

నిమజ్జనానికి భారీ బందోబస్తు

గణేశ్ నిమజ్జనంలో శాంతిభద్రతలకు ఏ మాత్రం విఘాతం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ కోటిరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం తాండూరులో వినాయక నిమజ్జనం సందర్భంగా ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కోకట్ కాగ్నానది వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నది వద్దకు చిన్నారులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ శేఖర్‌గౌడ్‌కు సూచించారు. అనంతరం పట్టణంలోని పాత తాండూరులో గల భావిగి భద్రేశ్వర దేవాలయం వద్దకు చేరుకొని అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేలా భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకోసం 6మంది డీఎస్పీలు, 14మంది సీఐలు, 22 మంది ఎస్సైలు, 57మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్‌లు, 181మంది కానిస్టేబుళ్లు, 61 మంది హోం గార్డులను నియమించినట్లు తెలిపారు. నిమజ్జనానికి ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు సహకరించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్పీ కరుణసాగర్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నిమజ్జనానికి విగ్రహాన్ని కదిలిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, జిల్లా అధికారులు


వినాయకుడికి నమస్కరిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి



తాండూరులో గణేశ్ శోభాయాత్ర

హత్య కేసులో భార్యకు రిమాండ్

కొత్తూరు: భర్తను రోకలితో మోది హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సీఐ శంకర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. పెంజర్ల గ్రామానికి చెందిన పాముల నర్సింహులు(50), నర్సమ్మ భార్యాభర్తలు. నర్సింహులు మూగవాడు కావడంతో పెళ్లి నాటి నుంచి దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతన్నాయి. నెల రోజుల క్రితం నర్సమ్మ మహిళా సంఘం నుంచి రూ.2లక్షల రుణం తీసుకుంది. ఈ డబ్బుతో తనకు బైక్ కావాలని భర్త కోరగా.. ఆమె బంగారం కొనుగోలు చేసింది. ఇదే విషయమంలో ఈ నెల 19న మద్యం మత్తులో ఇరువురూ గొడవపడ్డారు. విచక్షణ కోల్పోయిన భార్య రోకలితో భర్తపై దాడి చేసింది. గమనించిన స్థానికులు ఇద్దరినీ సముదాయించారు. తిరిగి మరోమారు ఆమె దాడిచేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితురాలు శుక్రవారం ఉదయం పట్టణంలోని కల్లు దుకాణం వద్ద ఉన్నట్లు గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన కారు

యువ రైతు మృతి

శంకర్‌పల్లి: స్కూటీని కారు ఢీకొట్టడంతో ఓ యువరైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. శంకర్‌పల్లి పీఎస్ పరిధిలోని పర్వేదకు చెందిన చాకలి శ్రీనివాస్(32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి పని నిమిత్తం తన స్కూటీపై శంకర్‌పల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులోకి రాగానే గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.